**తొలిగీటు...** దైవ విశ్వాసం గల వారితోనే స్నేహం చెయ్యండి. – మహాప్రవక్త ముహమ్మద్ (స)

# ఆధ్యాత్మిక రాజకీయ వ్యవస్థ ఆవిర్భవించాలి!

**ఆలోచన**

**ఏరు** దాటాక తెప్ప తగలేయడం రాజకీయ నేతలకు కొత్తకాదు. ఆ విద్య వారికి తెలిసినంతగా మరెవరికీ తెలియదు. ఆ విషయాల్లో ఎవరికి ఎవరూ, ఏ మాత్రం తీసిపోరు. ఏ పార్టీ నేతలు ఇందుకు అతీతం కాదు. అందుకు ఎవరినీ తప్పుపట్టి ప్రయోజనం లేదు. నిందించాల్సిన అవసరం వస్తే మనకు మనం ఆత్మ విమర్శ చేసుకోవాలి. నేతలతో మన సంబంధ బాంధవ్యాలను నెమరువేసుకోవాలి. వారి వ్యక్తిత్వాన్ని, విచిత్ర ప్రవర్తనను సందర్భానుసారం బేరీజు వేయాలి. అవసరానికి ముందు ఆ తరువాత వారి వైఖరిని పరిగణనలోకి తీసుకోవాలి. ఆపై వారితో మన అనుబంధాన్ని నిర్ధారించుకోవాలి. మున్ముందు వారితో కొనసాగే అంశాన్ని సమీక్షించుకోవాలి. కాని ఇది ఏ దశలో ఎక్కడా జరగదు. సర్దుకుపోవడానికి అలవాటు పడ్డ మనం, అన్ని వేళలా ఒకే పోకడ అనుసరిస్తాం. విమర్శించాల్సిన సందర్భం దక్కినా, తప్పులను ఎండగట్టే అవకాశం చిక్కినా, తెగతెంపులు చేసుకునే అవసరం వచ్చినా మనం అప్రమత్తంగా వ్యవహరించం. మనకెందుకులే అని ఊరుకుంటాం. ఓ నిట్టూర్పు విడిచి నిస్తేజంగా పడి ఉంటాం. రాజకీయ నేతలకు కూడా కావల్సింది ఇదే. జనం ఎంత అచేతనంగా ఉంటే వారికి అంతమంచిది. యోచించే తత్వాన్ని, ప్రశ్నించే గుణాన్ని వారు అస్సలు ప్రోత్సహించరు. ఈ రెండు వైఖరులు తమకే సొంతంగా భావిస్తారు. వీటిలో ఏది జరిగినా తమ వైపు నుంచే జరగాలని, అది తమ కోసమే అయి ఉండాలని కట్టడి చేస్తారు. ఆ దిశగా జనాలనూ ఉసిగొల్పుతారు. తమ క్యాడర్‌ను ప్రేరేపిస్తారు. ఇతరులకు కష్టమైనా, తమకు ఇష్టమైనవి అమలు కావాలని పట్టుబడతారు. దైనందిన రాజకీయాల్లో ఇటువంటి ఉదాహరణలు కోకొల్లలు. ఒక రోజు ఔనని, మరో రోజు కాదనే ఉదంతాలు బోలెడు. అడ్డొస్తే నరకడన్న నోటితోనే, అలా అనలేదని మరుక్షణమే బుకాయింపు.ఇదంతా మీడియా తప్పిదమని చివరకు ముక్తాయింపు. ఒకరోజు మహత్తర సందేశ ప్రబోధం. మరుసటి రోజు విరుద్ధ వైఖరితో ఆత్మ ద్రోహం. ఒక్కోరోజు వల్లమాలిన హామీల వరద. సాధ్యాసాధ్యాలు మర్చి మరోరోజు బురద. ఒకమారు సంక్షేమ జపం, మరోమారు సంక్షోభ హారం. కాలంతో పాటు ఈ వైఖరులూ మారుతుంటాయి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇవి పునరావృతం అవుతూనే ఉంటాయి. తమ హయాంలో ఔనన్న వారు తరువాత కాదనడం, తమదాకా వస్తే ఔననడం షరా మామూలే. ప్రజలు పాతవారే, పాలకులే కొత్తవారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రజా సంక్షేమం ప్రశ్నార్థక మవుతుంటుంది. పాలకులు తమ కోణంలోనే ప్రజాశ్రేయస్సుకు ప్రాధాన్యమిస్తారు. లాభనష్టాల బేరీజు పైనే జన హితాన్ని నిర్దేశిస్తారు. పజలు స్థిరం, పాలకులు అస్థిరం. అటువంటప్పుడు ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రజా సంక్షేమం ఎందుకు గాడి తప్పుతోంది? ప్రజల కోసం, ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వాలు, ఎందుకింత స్వార్థంతో వ్యవహరిస్తున్నాయి? జనం కంటే పార్టీ ప్రయోజనాలే ఎందుకింత ముఖ్యమయ్యాయి? ఇవన్నీ జవాబు తెలియని ప్రశ్నలు అయితే కావు. వీటన్నిటికి సమాధానం ఒక్కటే. అన్ని దశల్లోనూ 'జవాబుదారీ' తనం లోపించడమే. పాలితులు, పాలకులు తమకు ఏమి పట్టనట్లు వ్యవహరించడమే. ప్రజలు తమహితం కోసం పాటు పడే ప్రభుత్వాలు రావాలని మనసా, వాచా, కర్మణా కోరుకోకపోవడమే. పాలకులు, పరిశుద్ధులుగా, పవిత్రులుగా, సమర్ధులుగా ఉండాలని ఆశించకపోవడమే.ఏలికలు ఎవరైె ఉండాలని, ఎటువంటి వారు కావాలని, పార్టీ ఏదైతే మంచిదని, ఎటువంటిదై ఉండాలనే చైతన్యం కొరవడటమే. తమకు సంక్రమించిన అధికారం దైవదత్తమని పాలకులు భావించకపోవడం, తాము ప్రశ్నించబడతామనే భయం వారికి ఊహాలోనైన లేకపోవడం ప్రజల పాలిట శాపమౌతుంది. పాలనా పగ్గాలు పటాటోప ప్రదర్శనకూ, అధికార అందలాలు కంఠాభరణాలుగా ఏలికలు భావించినంత కాలం ప్రస్తుత పరిస్థితికి నిష్కృతి ఉండదు. పాలితులను, పాలకులను చైతన్యవంతం చేస్తూ, జవాబుదారీతనం పాదుగొలిపే రాజకీయ ధార్మిక వ్యవస్థ ఆవిర్భవించనంత కాలం ఈ దుస్థితి నుంచి విముక్తి లభించదు.


సహజీవన భావనల పావురాయి

గీతురాయి

వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar, Hyderabad-500 002.

Phone: 24564583 Telefax: 24576237

e-mail : geeturai@rediffmail.com

Website: www.teluguislamiclit.org

**సంపుటి : 32 సంచిక : 30 హైదరాబాద్**

శుక్రవారం 23 జులై 2010 రు.8-00

10 షాబాన్ 1431 హిజ్రీ



**ఎడిటోరియల్ టీమ్**

**గౌరవ సంపాదకుడు**

ఎస్.ఎమ్. మలిక్

**ప్రధాన సంపాదకుడు**

సాదిఖ్ అహ్మద్

**డెస్క్**

ముజాహిద్

యాఖూబ్

అశోక్


సి.డబ్ల్యు.జె. రాజకీయ వేదిక ఆవిర్భావం

సంక్షేమం సమన్యాయం
సాధించుటె మన ధ్యేయం
ఇదే లక్ష్య సాధనకై
వెలసిందొక అధ్యాయం!

ఆంధ్రప్రదేశ్ రాజకీయ
యవనికపై ఒక మలుపు
జనహితమే లక్ష్యమైతె
మనదే మరి గెలుపు!!



- *యం.డి. ఉస్మాన్‌ఖాన్*